
# హామీలు నెరవేర్చకుంటే ప్రజల పక్షాన పోరాటం

## రైతుబంధు, గొర్రె పిల్లలను వెంటనే అందించాలి : మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట, డిసెంబర్ 21: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను మూడు నెలల్లో అమలు చేయకుంటే ప్రజల పక్షాన పోరాడుదామని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బొంరాస్‌పేట మండలంలోని మెట్లకుంట సమీపంలో ఫాంహౌస్‌లో నిర్వహించిన బొంరాస్‌పేట, దుద్యాల మండలాల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి హామీలను అమలు చేయడానికి మూడు నెలల సమయం ఇస్తామని, ఆ లోగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పోరాటం చేస్తామని చెప్పారు. రైతు బంధు పథకం ద్వారా రైతులకు యాసంగి పెట్టుబడి సాయం నేటికీ అందజేయలేదని, గొర్రెల పంపిణీ కోసం డీడీలు చెల్లించిన గొల్ల కురుమలకు గొర్రెలను, రైతులకు పెట్టుబడి సాయాన్ని వెంటనే పంపిణీ చేయాలని నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి గెలిచిన వ్యక్తి సీఎం కావడం సంతోషకరమని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయామని కార్యకర్తలు అధైర్యపడరాదని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తే పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా పోరాటం చేయాలని, అందరికి తాను ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ బొంరాస్‌పేట, దుద్యాల మండలాల అధ్యక్షులు కోట్ల యాదగిరి, చాంద్‌పాషా, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్యపడకుండా కాంగ్రెస్ దాడులను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, నాయకులు మహేందర్‌రెడ్డి, దేశ్యానాయక్, మధుయాదవ్, నరేష్‌గౌడ్, మడిగె శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణ సజావుగా పూర్తి చేయాలి

### అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు



వికారాబాద్, డిసెంబర్ 21 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో వరి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ, డబ్బు చెల్లింపుల విషయమై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కొనుగోలు కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. గన్నీ బ్యాగులు, వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సేకరించిన ధాన్యానికి ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగే విధంగా డాటా ఎంట్రీ పనులను చేపట్టాలని సూచించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యానికి కనీసం 70% చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు చెల్లింపుల ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని, సెలవు దినాల్లో కూడా పనులు నిర్వహించి చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేయా లని ఆదేశించారు. ఈ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. టెలికాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డీఆర్‌డీవో కృష్ణన్, పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శంకరాచారి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, డీసీఎంఎస్ మేనేజర్ పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధర కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు



వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

యాలాల, డిసెంబర్ 21: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. గురువారం తాండూరు ఆర్డీవో శ్రీనివాస రావుతో కలసి యాలాల మండల పరిధిలోని అగ్గనూరు వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దతు ధర కల్పించడం కోసం ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. తప్పని సరిగా నాణ్యతా ప్రమా ణాలను పాటించి తేమ శాతం 17 శాతం తగ్గకుండా ధాన్యాన్ని తీసుకొని వస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు.

### నర్సరీ పనుల పరిశీలన



దోమ, డిసెంబర్ 21: హరితహారం నర్సరీలో మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ బల్ల రాణి వెంకటేష్ అన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని లింగనపల్లి గ్రామ పంచాయితీలో హరితహారంలో భాగంగా కొనసాగుతున్న నర్సరీ పనులను సర్పంచ్ పరిశీలించారు.

## ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రోహిత్ మిరియాల

నవాబుపేట, డిసెంబర్21: విక్షిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా గురువారం మండల పరిధిలోని కేశపల్లి, చిట్టిగిద్ద గ్రామాల్లో ప్రధానమంత్రి ఆరోగ్య పథకం వల్లన కలిగే వైద్య సదుపాయాలను ప్రజలకు ఆరోగ్య మిత్ర ఇన్‌చార్జి ఊరెళ్ల నర్సింహులు తెలిపారు. కార్డులు పొందడం ద్వారా లబ్ధిదారులు రూ. పది లక్షల వరకు వైద్య సేవలను పొందవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అంతకు ముందు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ రోహిత్ మిరియాల మాట్లాడుతూ ఆరోగ్య సంబంధిత విషయాల్లో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులకు షుగర్, రక్త, తెమడ వంటి పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సుధాకర్ రెడ్డి, శ్రీలత, డాక్టర్ రోహిత్ మిరియాల, ఎస్‌బీఐ నోడల్ ఆఫీసర్ నీలిమ, సీహెచ్‌వో శివశంకర్, హెల్త్ సూపర్‌వైజర్ సుగుణ, సిందాల బ్యూల, ల్యాబ్ సూపర్‌వైజర్ నవీన్ గౌడ్, ట్రీట్‌మెంట్ సూపర్ వైజర్ రాణి, ల్యాబ్ టెక్నీషియన్ బాలరాజ్ పాల్గొన్నారు

## వార్డు సభ్యులకు సన్మానం



పూడూరు.డిసెంబర్ 21: ఐదు సంవత్సరాలుగా గ్రామాభివృద్ధిలో భాగ స్వాములై సహకరించడంతో తన వంతు అభివృద్ధి పనులు చేశానని సర్పంచ్ జయమ్మదాస్ పేర్కొన్నారు. ఈ నెల చివరి వరకు ఐదు సంవత్సరాల సర్పంచ్ పదవి ముగియనుండడంతో పూడూరు మండలం అంగడి చిట్టంపల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులను, కార్యదర్శి, కారోబార్‌లను సర్పంచ్ ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి సహకరించిన యువజన సంఘుల సభ్యులకు,గ్రామ పెద్దలకు, వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర వాలీబాల్ జట్టుకు కుల్కచర్ల విద్యార్థి ఎంపిక



దోమ/కుల్కచర్ల డిసెంబర్ 21: రాష్ట్ర వాలీబాల్ జట్టుకు కుల్కచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థి విశాల్ ఎంపికైనట్లు కుల్కచర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హబీబ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠలలో 9వ తరగతి చదువుతున్న విశాల్ ఈ నెల 12 నుంచి 15 వరకు నారాయణపేట జిల్లాలో జరిగిన వాలీ బాల్ క్రీడలో ఉన్నత ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు.

### ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు

వికారాబాద్, డిసెంబర్ 21 : వికారాబాద్ కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలలో 2024-25 ఇంటర్ విద్యా సంవత్సరం ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ అపర్ణ గురువారం ఒక ప్రకటలో తెలిపారు. మార్చి లో 10వ తరగతి పరీక్షలకు హాజరు కానున్న తెలంగాణ బాలబాలికలు ఎంపీసీ, బీపీసీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన ఉంటుంది. అలాగే కళాశాలలో ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు, ఉచిత శిక్షణతో పాటు చక్కని వసతి సదుపాయాలు ఉంటాయని పేర్కొన్నారు. జనవరి 15 వరకు చివరితేదీ ఉందన్నారు.

### ఐదో తరగతిలో ప్రవేశాలకు...

వికారాబాద్, డిసెంబర్ 21 : జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి (డీసీవో) టీఎస్‌డబ్ల్యూఆర్ (జి) కళాశాల ప్రిన్సిపాల్ అపర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు చివరి తేదీ జనవరి 6, 2024 వరకు ఉందన్నారు. ప్రవేశ పరీక్ష తేదీ ఫిబ్రవరి 11, 2024న ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### 23న ఉత్తర ద్వార దర్శనం

పరిగి, డిసెంబర్ 21: ఈనెల 23వ తేదీ శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా పరిగిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 7.30 గంటలకు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

### 26న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నవాబుపేట,డిసెంబర్21: మండలం పరిధిలోని యెల్లకొండ గ్రామం పులికుంట గుట్ట (సాయిధామము) వద్ద ఉన్న సాయిబాబా ఆలయం రెండో వార్షికోత్సవాన్ని ఈ నెల 26న ఘనంగా నిర్వహించనున్నట్లు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రావుగారి వెంకట్‌రెడ్డి గురువారం తెలిపారు. తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య, మండల ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు.

### సాయి మందిరంలో ఉచిత వైద్యశిబిరం

పూడూరు,డిసెంబర్ 21: మండల కేంద్రం సమీపంలోని హైదరాబాద్-బీజాపూర్ హైవే రోడ్డులో ఉన్న షిరిడి సాయి మందిరంలో డాక్టర్ నారాయణ ఆధ్వర్యంలో ప్రతి గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తారు. దంత, కంటి పరీక్షలు చేసిన అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. వైద్యశిబిరానికి 170 మంది హాజరు కాగా 40 మందిని కంటి శస్త్ర చికిత్స కోసం నగరానికి తరలించినట్ల వైద్యులు పేర్కొన్నారు.

### హనుమాన్ ఆలయానికి గ్రానైట్ విరాళం

మర్పల్లి, డిసెంబర్ 21: మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన రామ్‌పూర్ గ్రామంలో నిర్మించిన అంజనేయ స్వామి ఆలయానికి రూ. లక్షా యాభైవేలు విలువ చేసే గ్రానైట్‌ను దాతల అలుగోల బిచ్చన్న గురువారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజు, రమేష్, ప్రభు ఉన్నారు

### తాగివాహనాలు నడిపితే చర్యలు తప్పవు

పరిగి టౌన్, డిసెంబర్ 21: తాగి వాహనాలు నడిపితే వాహనదారులపై చర్యలు తప్పవని పరిగి ఎస్సై సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం పరిగి పట్టణంలోని పరిగి-షాద్‌నగర్ రోడ్డుపై వాహనాలను తనిఖీ చేశారు. నూతన వేడుకల సందర్భంగా ముందస్తు తనిఖీలు నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

### పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బిఎల్‌వోలకు శిక్షణ

దోమ/కుల్కచర్ల డిసెంబర్21: రాబోవు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఎల్ వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, రెవెన్యూ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లు గోపాల్, శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. ఓటరు లిస్టు వెరిఫికేషన్‌లో భాగంగా తప్పులను సరిదిద్దుకునే విధంగా శిక్షణ ఇచ్చి ఎన్నికలకు సమాయత్తం చేసినట్లు మాస్టర్ ట్రైనర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గోపాల్, శ్రీనివాస్, రాజేశ్‌రాథోడ్ , డీటీ రమేశ్ పాల్గొన్నారు.



బొంరాస్‌పేట, డిసెంబర్ 21 : ఈ నెల 23వ తేదీన నిర్వహించే వైకుంఠ ఏకాదశి పర్వదినానికి దుద్యాల మండలం హకీంపేట గ్రామంలోని శ్రీ రాకమకొండ స్వామి దేవాలయం ముస్తాబైంది. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. 23వ తేదీన ఉదయం పల్లకీసేవ, ఉత్తరద్వార దర్శనం ఉంటుందని దేవాలయ వ్యవస్థాపకులు అరుణ యాదయ్య తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.